


మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## ఈ నెల 8న నిర్వహించే కేటీఆర్ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

### - కేటీఆర్ హెలిప్యాడ్ స్థల పరిశీలన



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**కల్వకుర్తి, మే 05 ప్రభాతవార్త:** మాజీ మంత్రి కేటీఆర్ పర్యటనకు కల్వకుర్తిలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం కేటీఆర్ హెలిప్యాడ్ స్థలాన్ని స్థానిక మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంతో కలిసి మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అబద్దాల హామీలతో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడాలన్నారు. అమలు కానీ హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ నెల 8న కల్వకుర్తి పట్టణంలో కేసీఆర్ ఫంక్షన్‌హాల్ నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొండూర్ గోవర్ధన్, మండల పార్టీ అధ్యక్షులు విజయ్‌గౌడ్, నాయకులు మనోహర్‌రెడ్డి, ఆనంద్ తదితరులు ఉన్నారు.

## గిరిజనుల అభ్యున్నతి భాజపాతోనే సాధ్యం

### - కేంద్ర మంత్రి ఎల్.ముర్గన్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి ఎల్.ముర్గన్

**అచ్చంపేట, మే 05 ప్రభాతవార్త:** గిరిజన సమాజంతో భారతీయ జనతా పార్టీకి అవినాభావ సంబంధం ఉంటుందని, గిరిజనుల స్థితి గతులను మార్చే ప్రయత్నం చేసిన ప్రభుత్వం నరేంద్రమోడీ ప్రభుత్వమని కేంద్రమంత్రి వర్యులు ఎల్.ముర్గన్ స్పష్టం చేశారు. భారత ప్రథమ మహిళాగా గిరిజన బిడ్డను నిలిపిన ఏకైక పార్టీ బీజేపీ పార్టీ అని, తెలంగాణకు గిరిజన యూనివర్సిటీ ఇచ్చిన ప్రభుత్వం మోడీ ప్రభుత్వమని, రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు గిరిజనుల మద్దతు 100 శాతం ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. నరేంద్రమోడీ నాయకత్వాన్ని దేశం కోరుకుంటుందని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ని విశ్వగురువుగా నిలుపడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న నరేంద్రమోడీ మరోసారి మూడోసారి ప్రధానిగా గెలిపించాలన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భరత్‌ప్రసాద్ గెలుపునకు గిరిజనులు ఏకం కావాలని కోరారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు రాములు, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్, బీజేపీ నాయకులు కట్ట సుధాకర్‌రెడ్డి, మంగ్యానాయక్, రవినాయక్, రేణయ్య, గణేష్, పత్యానాయక్, చందులాల్‌చౌహన్, నరేందర్‌రావు, సైదులుయాదవ్, జానకి, సుగుణమ్మ, కమలమ్మ తదితరులు ఉన్నారు.

## ఈవీఎంల కమిషన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా ఎన్నికల అధికారి ,కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

**వనపర్తి ప్రతినిధి మే 5 ప్రభాతవార్త :** ఎన్నికల్లో కీలకమైన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు.ఆదివారం చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాం లో సహాయ రిటర్నింగ్ అధికారి ఎం నగేష్ పర్యవేక్షణలో,రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో సెక్టార్ అధికారులు ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కమీషనింగ్ ప్రక్రియను పరిశీలించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో కీలకమైన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా పూర్తి చేయాలని సూచించారు.మాక్ పోలింగ్ నిర్వహించి పోలింగ్ డే కోసం ఈవీఎంల ను సిద్దం చేయాలని సూచించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం నాగేష్,ఎన్నికల అధికారులు,సెక్టార్ అధికారులు,రాజకీయ పార్టీల ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల వ్యాపారులకు పూర్తి మద్దతు..

### మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 05 ప్రభాతవార్త :** పండ్ల వ్యాపారులకు నా పూర్తి మద్దతు ఉంటుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణ పండ్ల వ్యాపారుల సంక్షేమం కోసం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మీకు చాలా సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి న అవసరం ఉందని, అది నాపూర్తి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. దాదాపు 11 వేల మంది కూరగాయలు, పండ్లు వీధుల్లో వ్యాపారాలు చేస్తున్నారని, కొందరి ఆర్థిక పరిస్థితి బాగాలేని వారికి బ్యాంకు వారితో మాట్లాడి లోన్స్ ఇప్పించే ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అంతే కాకుండా వీధి వ్యాపారుల కోసమే ప్రభుత్వం చేత వడ్డీలేని రుణాల కోసం ఒక బ్యాంకు ఏర్పాటు కోసం ముఖ్యమంత్రితో మాట్లాడి కృషి చేస్తానని ఆయన చెప్పారు. మన మహబూబ్‌నగర్ అభివృద్ధికి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని పార్టీలకతీతంగా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌పి వెంకటేష్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, అబ్దుల్ నిసార్, యండి హుస్సేన్, మునావర్, మధు, అక్సర్, షాహెద్, ఖాజా నియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి : ఎమ్మెల్యే కసిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

**వెల్దండ, మే 05 ప్రభాతవార్త:** దేశంలో సబ్బండ వర్గాల సంక్షేమంతో పాటు దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తోడేటి చెన్నారెడ్డి ఫంక్షన్‌హా ల్‌లో ఆదివారం పార్టీ నాయకులు, బూత్ లెవల్ కార్యకర్తలతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు భారత్ జోడోయాత్ర ద్వారా రాహు ల్‌గాంధీ ప్రజల సమస్యలను తెలుసుకు న్నారని, ప్రజలందరు రాహుల్ గాంధీ జోడో యాత్రకు బ్రహ్మరథం పట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే దేశంలో, రాష్ట్రంలో అభివృద్ధి పనులు నిర్వహించారని, బీజేపీ పార్టీ దేశంలో అధికారంలో ఉండి అభివృద్ధి ఫలాలు ధనికులకు అందించి మరింత ధనికులను చేశార ని, పేదలను మాత్రం మరింత పేదరికంలోకి నెట్టారన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో మరో సారి మోడీ అధికారం చేపడితే దేశ ప్రజలందరు ఆర్థిక సమస్యలతో కొట్టామిట్టాడుతారని, ప్రజ లందరు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎన్నికల ఇన్‌చార్జి ఇందిర శోభన్, కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కృష్ణ ముదిరాజ్, గుర్రం కేశవులు, కొపు రాణి, పుల్లయ్య పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు..



ఒరిగిన విద్యుత్ స్తంభాలు

**అలంపూర్ మే 5 ప్రభాతవార్త :** ఉండవల్లి మండలం పుల్లూర్ గ్రామ పంచాయతీ అలంపూర్ చౌరస్తాలోని వెంకటసాయి,సాయి సిరి నివాస్ నగర్‌లో రెండు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాధభరితంగా మారాయి విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉండడంతో స్థానికులు రైతులు భయాందోళన చెందుతున్నారు.అటుగా వెళ్లే వారు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాపోతున్నారు.రైతులు నిత్యం ఆ దారి గుండా తమ పంట పొలాలకు వెళ్తుంటారు ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# రాజ్యాంగాన్ని నలిపివేసే కుట్ర

- రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్, నెహ్రూ, గాంధీ పాత్ర
- కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు రిజర్వేషన్లు
- మహిళలకు ఏడాదికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం
- కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ
- 9వ తేదీలోగా రైతుభరోసా నిధులు విడుదల చేస్తాం
- డికె అరుణకు కాంగ్రెస్ పార్టీ ఎంతో చేసింది
- 0౦డు కాంగ్రెస్ ఎంపీలను గెలిపించాలి
- నడిగడ్డ అభివృద్ధికి చిత్తశుద్ధితో ఉన్నాం..
- ఎర్రవల్లి ఎన్నికల జన జాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




**ఇటిక్యాల, మే 5 ప్రభాతవార్త :** దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్రలు చేస్తుందని భారత రాజ్యాంగ నిర్మాణంలో ఎంతో కష్టపడి డా.బిఆర్ అంబేద్కర్, నెహ్రూ, గాంధీల పాత్ర ఉందని నరేంద్రమోడీ దేశంలోనే 22 కుటుంబాలకు అండగా ఉండి 16 లక్షలకోట్ల రుణమాఫీ చేశారని అలానే అంబాని ఇతర ధనవంతులు ఉన్నారని కానీ దేశంలోని రైతులకు రుణమాఫీ చేయడం లేదని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేసి ఉన్నత చదువులు చదువుకున్న వారికి ఉద్యోగాలు కల్పిస్తామని మహిళలకు ఏడాదికి లక్ష రూపాయల సహాయాన్ని బ్యాంక్ అకౌంట్లో జమ చేస్తామని కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జనజాతర సభకు కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షి, కార్యదర్శి రోహిత్‌చౌదరి,రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు ఎస్సీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ఇప్పుడు జరిగే ఎన్నికలు ఇండియా కూటమికి ఎన్డీఏ కూటమికి జరిగే ఎన్నికలని దేశంలో అన్ని వర్గాల వారికి రాజ్యాంగం వల్లే న్యాయం జరుగుతుందని భారతదేశం స్వాతంత్రం తరువాత ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఉపాధి ఉద్యోగాలు రాజ్యాంగం వల్లే లభిస్తున్నాయన్నారు. ఇటువంటి రాజ్యాంగాన్ని బిజెపి ప్రభుత్వం నిలిపివేసి రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఈ కుట్రలను తిప్పికొట్టి భారత రాజ్యాంగాన్ని రిజర్వేషన్లను కాపాడుకుందామని రాహుల్‌గాంధీ ప్రజలకు స్పష్టం చేశారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసినప్పుడు లక్షలాది మంది నిరుద్యోగులు తాము ఎంతో కష్టపడి చదివిన నరేంద్రమోడీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని తన దృష్టికి తేవడం జరిగిందన్నారు. డిగ్రీలు, డిప్లమా ఇతర ఉన్నత చదవులు చదివిన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వివరించారు. దేశంలో దారిద్ర రేఖకు దిగువ ఉన్న కుటుంబాలను గుర్తించి జాతీయ జనగణన ద్వారా వారి అర్హతల ఆధారంగా పేద కుటుంబాల మహిళల పేరుతో ప్రతినెల రూ. 8500 చొప్పున సంవత్సరానికి లక్ష రూపాయలను బ్యాంకు అకౌంట్లో జమ చేస్తున్నట్లు రాహుల్‌గాంధీ అన్నారు. ఇలాంటి ప్రపంచంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయలేదని బిజెపి ప్రభుత్వం దేశ ప్రజల మధ్య మతాల చిచ్చు పెడుతుందని ఇలాంటి పరిస్థితులను అధిగమించి దేశ ప్రజల మనసులు గెలిచేలా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తుందని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల తొమ్మిదిలోగా రైతులకు రైతుభరోసా నిధులు విడుదల చేస్తామని ఆరు గ్యారంటీ పథకాలలో ఇప్పటికి ఐదు గ్రామానికి పథకాలు అమలు చేశామని కెసిఆర్ హరీష్‌రావు గ్యారంటీ పథకాలపై అవాస్తవాలు చెబుతున్నారని కెసిఆర్ చీర కట్టుకుని హైదరాబాద్ నుండి బస్సులో వచ్చి జోగులాంబ అమ్మవారిని దర్శించుకుంటే గ్యారంటీ పథకం అమలు అవుతుందా లేదా తెలుస్తుందని అలాగే హరీష్‌రావు రైతు రుణమాఫీపై మాట్లాడుతున్నరని ఆగస్టు 15వ తేదీలోగా రైతులకు రెండు లక్షల రుణమాఫీని మాఫీ చేస్తామని సవాల్ విసిరారు. కారు రిపేరులో ఉన్నదని ఆ కారును తూకానికి అమ్ముకోవాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధికమెజార్టీ ఇచ్చి ఎంపిలను గెలిపించాలని డిసెంబర్‌లో సెమి ఫైనల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కెసిఆర్‌ను ఓడించామని పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి ఫైనల్‌లో మోడీని ఓడించబోతున్నట్లు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా, బయ్యారం ఉక్కు కర్మాగారం ప్రధానిని అడిగితే ఏవి ఇయ్యకుండా గాడిదగుడ్డు ఇచ్చారని విమర్శించారు. తాను పాలమూరు జిల్లా బిడ్డగా తెలంగాణ ప్రజలు నాకు ముఖ్యమంత్రిగా జోగులాంబలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుండి ఎంపి అభ్యర్థులను లక్షల మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కృష్ణ, తుంగభద్ర మధ్య ఉన్న నడిగడ్డ మాట ఇస్తే తప్పరని ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని రాహుల్‌గాంధీ సాక్షిగా నడిగడ్డ నుండి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిని లక్ష ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నడిగడ్డలో బంగ్లా రాజకీయం చేస్తున్నారని అత్తమామ ఒక్కటై కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించారని విమర్శించారు. నడిగడ్డలో గట్టు ఎత్తిపోతల తుమ్మిళ ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామని ఆర్డీఎస్ ప్రాజెక్టు ద్వారా పెండింగ్ పనులను పూర్తి చేసి అలాగే ఎర్రవల్లి నుండి రాయచూరుకు

-మిగతా3లో..

# కులవృత్తులను కాపాడుకుందాం

- మట్టి పాత్రలు విశిష్టమైనవి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- మహబూబ్‌గర్‌లో 2 వేల మట్టికుండలు ఉచితంగా పంపిణీ



మట్టి కుండలను అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 05 ప్రభాతవార్త :** మట్టిపాత్రలు చాలా విశిష్టమైనవి. ఆరోగ్య ప్రయోజనాలు కాపాడేవని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కుమ్మరివాడిలో సాయంత్రం 2వేల మట్టి కుండలను మహబూబ్‌నగర్ పట్టణంలోని పేదలు జీవిస్తున్న ప్రాంతాల్లో ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నవీన యుగంలో కులవృత్తులు మరుగున పడిపోతున్నాయని, కుల వృత్తులు కనుమరుగవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది సంవత్సరాలుగా కొన్నికోట్ల మంది వారివారి కులవృత్తులను నమ్ముకుని జీవనాన్ని సాగిస్తున్నారని, గ్రామాలలో నివసించే వారు వ్యవసాయం చేస్తుంటే, వారికి వివిధ కుల వృత్తులు చేసేవారు వారికి కావలసిన వస్తువులను తయారు చేసి అందించేవారని, పంట చేతికి వచ్చిన తర్వాత వారి పనికి సరిపడా ధాన్యం అందించేవారని గుర్తు చేశారు. ఊర్లలోనే కాదు పట్టణాల్లో సైతం ఈ కుల వృత్తులను నమ్ముకుని చాలామంది జీవనం సాగిస్తున్నాయని ఆయన చెప్పారు. అందుకే ఉడతా భక్తిగా కులవృత్తులు మరుగున పడకుండా వారికి చేయూత అందించే కార్యక్రమంలో భాగంగా ఈరోజు మట్టి కుండల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పింగాణీ పాత్రలు, ప్లాస్టిక్ పాత్రలు ఇలా రకరకాల పాత్రల వాడకం వల్ల ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయని ముఖ్యంగా క్యాన్సర్ లాంటి ప్రాణాంతక రోగాలు కూడా మనకు వచ్చే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. ప్లాస్టిక్ పాత్రలు వంద సంవత్సరాల కాలమైనా అవి మట్టిలో కలిసిపోయే అవకాశం లేదని అందుకే మట్టి పాత్రలు వాడుకుందాం ఆరోగ్యాన్ని కాపాడుకుందా.. కులవృత్తులను రక్షించుకుందాం అనే నినాదంతో ముందుకు వస్తున్నామని ఆయన చెప్పారు. ఎన్నికల సమయం కాబట్టి ఎక్కువగా ప్రచారం చేయలేకపోయామని, ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆగుదామంటే ఎండాకాలం ముగుస్తుంది. కాబట్టి ఈ రోజు ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే ఏడాది ఇంకా ఎక్కువ మంది సహకారంతో మట్టి పాత్రలు వాడకాన్ని ప్రాచుర్యంలోకి తీసుకుని వద్దామని, మన చుట్టు ఉన్న పేద కుటుంబానికి కనీసం రెండు, మూడు మట్టి పాత్రలు ఉచితంగా అందిస్తే కనీసం 50 శాతం అయినా పర్యావరణాన్ని రక్షించిన వాళ్లము అవుతామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, నాగప్ప, అచ్చన్న, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

### స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ


### చురుకుగా పాల్గొన్న ట్రాన్స్‌జెండర్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 5 ప్రభాతవార్త :** ఈ నెల 13న మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికలలో ప్రతి ఓటరు ఓటుహక్కు వినియోగించుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు స్వీప్ ర్యాలీ చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతి,కుల, మతాల తేడా, వయోబేధం లేకుండా అన్ని వర్గాల వారు ఓటింగ్‌లో తప్పక పాల్గొనాలని ఓటర్లు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న నిర్వహించబోయే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని, 18 సంత్సరాలు దాటిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తీవ్రమైన ఎండను దృష్టిలో ఉంచుకొని ఉదయం 7 గం.లనుండి సాయంత్రం 6 గం.ల వరకు ఓటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగా అన్ని వర్గాల వారు పాల్గొని ఒక్క ఓటు కూడా వ్యర్థం కాకుండా అందరూ ఓటింగ్‌లో పాల్గొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కళాజాత బృంద గీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ట్రాన్స్‌జెండర్లు తమవంతు పాత్రగా ర్యాలీలో చురుకుగా పాల్గొని నినాదాలిచ్చారు. ఎన్‌సిసి బృందం కవాతుగా ర్యాలీలో పాల్గొనడం విశేష ఆకర్షణగా పలు నినాదాలిచ్చారు. స్వీప్ నోడల్ అధికారి డా. శ్రీధర్ సుమన్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల సిబ్బంది, మెప్మా మహిళా సిబ్బంది, కళాజాత బృందం, ఎన్‌సిసి క్యాడెట్లు, ఐసిడిఎస్ మహిళా కార్యకర్తలు, పోలీస్ సిబ్బంది, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.




వనపర్తి జిల్లా కేంద్రానికి సమీపంలో గల తిరుమలాయగుట్ట వేసవికాలం ముందు అటవీ ప్రాంతమంతా హరిత శోభితంగా మారి ఉన్న దట్టమైన ప్రకృతి అలుముకుంది. తిరుమలయగుట్ట ప్రాంతంలో ఎటు చూసిన పచ్చదనంతోనే కనిపించేది. ఆ తిరుమలేశుడు కొలువుదీరిన నిటారుగా ఉన్న గుట్టపైన కనిపించే రూపం మహా అద్భుతంగా చూపరులను ఆకట్టుకునే విధంగా కనిపిస్తోంది. కానీ నేడు ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఎండి పోయిన దృశ్యాలను వార్తా క్లిక్ కనిపించింది.

- వనపర్తి ఫోటోగ్రాఫర్



## వర్గ రహిత దోపిడి లేని సమ సమాజం కోసం కృషి చేయాలి

**కల్వకుర్తిటౌన్, మే 05 ప్రభాతవార్త:** వర్గ రహిత దోపిడి లేని సమ సమాజం కోసం కృషి చేయాలని ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ వెంకటేశ్వర్లు అన్నారు. కారల్ మార్క్స్ 26వ జయంతిని పురస్కరించుకొని కల్వకుర్తి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవిత చరిత్ర మహత్తర ఘట్టమని, ప్రపంచ మేధావుల్లో ఇద్దరు వ్యక్తులు అంబేద్కర్, కారల్ మార్క్స్ అన్నారు. కారల్ మార్క్స్ లండన్‌లోని మ్యూజియంలో గల గ్రంథాలన్ని చదివారని, అతను గొప్ప చరిత్రకారుడు, తత్వవేత్త అని కొనియాడారు. మార్క్స్ సిద్ధాంతం కమ్యూనిస్టు మెనిఫెస్టో వల్లనే రష్యాలో విప్లవం విజయవంతమైందని, క్యూబా లాంటి అనేక దేశాల్లో సోషలిస్టు ప్రభుత్వాలు ఏర ్పడ్డాయని, చైనాలో కూడా మావో నాయకత్వంలో ఏర్పడ్డ కమ్యూనిస్టు ప్రభుత్వం నేటికి కొనసాగుతుందని, ఎప్పటికైన ప్రజల విముక్తి కోసం ఎర్రజెండా నాయకత్వంలో సోషలిజం అజేయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఆంజనేయులు, జిల్లా నాయకులు ఏపీ మల్లయ్య, బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, జగన్, వెంకటయ్య, లక్పతీనాయక్ తదితరులు ఉన్నారు.



## పీయూలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

**93 మంది విద్యార్థుల ఎంపిక**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 05 ప్రభాతవార్త :** ఇటీవల పాలమూరు యూనివర్సిటీ పరిధిలో క్యాంపస్ కాలేజీలు, అనుబంధ కాలేజీ విద్యార్థులకు యూనివర్సిటీలో హెటిరో డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్లేస్మెంట్ అధికారి డా. ఎస్‌ఎస్‌ఎన్ అర్జున్‌కుమార్ మాట్లాడుతూ బిఫార్మసీ, ఎం ఫార్మసీ, కెమిస్ట్రీ, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ అండ్ మైక్రోబయాలజీ విద్యార్థులు ఈ సెలక్షన్స్‌లో పాల్గొన్నారని, పరీక్ష ఇంటర్వ్యూలలో ప్రత్యేక ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఈరోజు ఫైనల్ లిస్టు ఎంపిక చేశారని, ఒకసారి 63 మంది క్యాంపస్ విద్యార్థులు, 29 అనుబంధ కాలేజీ విద్యార్థులు ఎన్నిక కావడం సంతోషకరమని, త్వరలో ఉప కులపతి ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా. చంద్రకిరణ్‌ల సమక్షంలో నియామక పత్రాలు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

## దేశం అభివృద్ధి భారతీయ జనతా పార్టీతోనే సాధ్యం

**భాజపా ఎంపి అభ్యర్థి డికె అరుణమ్మ.. పలు పార్టీల నుంచి భాజపాలో చేరికలు**

**రాజాపూర్, మే 05 ప్రభాతవార్త :** దేశం అభివృద్ధి భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని రాజాపూర్ మండల కేంద్రంలోని వివిధ గ్రామాల నుండి వివిధ పార్టీల కార్యకర్తలను కండువా వేసి భాజపా ఎంపి అభ్యర్థి డికె అరుణమ్మ పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర భారతీయ జనతా పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డికె అరుణమ్మ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలను దాదాపు 150పైగా కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, బిజెవైఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**కేసు నమోదు : ఎస్సై బి. నరేష్**

**తెల్కపల్లి, మే 05 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై బి. నరేష్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన కోలా నగేష్ (30) ఆదివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనం టివిఎస్ ఎక్సెల్‌పై తెల్కపల్లికి వెళ్తుండగా గౌరెడ్డిపల్లి గ్రామ శివారులోని ఎపి 28 బియు 8367 కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా తన కారును నడిపి నగేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో నగేష్‌కు గాయాలు కాగా వెంటనే గమనించిన స్థానికులు నగేష్‌ను చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. నగేష్ చిన్నాన్న బిచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**తెల్కపల్లి, మే 05 ప్రభాతవార్త :** చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై బి. నరేష్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన మోతల బాలస్వామి (60) శనివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనం టివిఎస్ ఎక్సెల్‌పై తెల్కపల్లి నుండి పెద్దపల్లికి వెళ్తుండగా గౌరెడ్డిపల్లి చౌరస్తా దగ్గర లింగాల మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన అఖిల్ తన ద్విచక్ర వాహనం టిఎస్ 31 కె 4275తో ఢీకొట్టడంతో బాలస్వామి తీవ్రంగా గాయపడగా వెంటనే మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై బి. నరేష్ తెలిపారు. మృతుని తమ్ముని కొడుకు మూతల మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**రేవల్లి మే 5 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఉదయం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తిరుపతి రెడ్డి తెలుగు వివరాల ప్రకారం చిలకేశ్వరం గంగపురి(62) హైదరాబాదులో కూలి పని చేసుకుంటూ జీవనం గడుపుతూ ఉండేవారు అయితే గత కొన్ని రోజుల నుండి ఎలాంటి పని చేయకుండా తాగుతూ ఉండేవాడు ఇలా తాగుడుకు బానిసైన అతనిని ఎప్పుడూ ఇలా తాగుతూ ఉంటే మీ ఆరోగ్యం పాడవుతుంది అని కుటుంబ సభ్యులు చెప్పడంతో మీరేమిది నాకు చెప్పడం అని హైదరాబాదు నుండి గురువారం రోజు తన సొంత గ్రామమైన రేవల్లి గ్రామానికి రావడం జరిగింది. ఈ తరుణంలో తన సొంత పొలంలోని చీరతో ఉరి వేసుకుని ఉదయం ఐదు గంటల సమయంలో మృతి చెందాడు నిత్యం పొలం పనులకు వెళ్లే వారు ఇది గమనించి చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు అలాగే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు శవాన్ని క్రిందికి దించి రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తికి ముగ్గురు ఆడపిల్లలు ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్సై పేర్కొన్నారు.



## కష్టాలు పెట్టిన దేవుడు మార్గాలను కూడా చూపుతాడు

**పాపయ్య మధుసూదన్ రెడ్డిని పరామర్శించిన మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి**

**కొత్తకోట మే 5 ప్రభాతవార్త :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన పాపయ్య మధుసూదన్ రెడ్డి భార్య సుధారాణి ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ వనపర్తి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి మనోధైర్యం ఇచ్చారు. ఈ సందర్భంగా మనోధైర్య మిస్తు కష్టాలు పెట్టిన దేవుడే మార్గాలను చూపుతాడని మనోధైర్యంగా ఉండాలని రావుల చెప్పారు. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ వెంట జడ్పీవైస్ చైర్మన్ వామన్ గౌడ్ కొత్తకోట మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖేషిని విశ్వేశ్వర్, కానాయపల్లి మాజీ సర్పంచ్ యాదయ్య సాగర్, మున్సిపల్ కౌన్సిలర్ ఖాజా మైనోద్దీన్ ,కో ఆప్షన్ సభ్యులు వసీం ఖాన్, కురుమూర్తి దేవస్థానం మాజీ డైరెక్టర్ నాగరాల శ్రీనివాస్ రెడ్డి, 13వ వార్డుకు చెందిన పాపయ్య రవీందర్ రెడ్డి, ఐటిఐ కార్యదర్శి ఎండి మజీద్, కానాయపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస సాగర్, రామనంతపురం నరేందర్, కొట్టాల దామోదర్ రెడ్డి, బిఆర్ఎస్ ఉద్యమ కారుడు చాంద్ పాషా, తెలంగాణ సారీ సెంటర్ రషీద్ తదితరులు పాల్గొని మదుసూదన్ రెడ్డిని పరామర్శించారు.



# బీఆర్ఎస్‌కు పెరుగుతున్న మద్దతు..

- కేసీఆర్ రాకతో మారిన సీన్
- తనకు బలం ఇవ్వాలంటూ అధినేత పిలుపు
- మచ్చలేని మన్నెను గెలిపించాలంటున్న గులాబీబాస్
- ట్విట్టర్‌లో శ్రీనివాస్‌రెడ్డిపై కేటీఆర్ ప్రశంసలు
- కరెంట్, నీటి సమస్యే ఆయుధంగా ప్రజల్లోకి,,
- ఏ మేరకు బలం చేకూరుతుందో వేచి చూడాల్సిందే..

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 5, ప్రభాతవార్త :** బీఆర్ఎస్ గ్రాఫ్ పెరుగుతున్నట్టు తెలుస్తున్నది. గులాబీ బాస్ రాకతో పరిస్థితులు మారుతున్నాయి. అప్పటివరకు కొంత స్తబ్దంగా సాగిన ప్రచారం ఊపందుకున్నది. కేసీఆర్ రోడ్‌షో, కార్నర్ మీటింగ్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మైలేజ్ పెంచిందని చెప్పవచ్చు. గత పదేండ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఐదేండ్లలో ఎంపీగా మన్నె చేసిన చేసిన సేవలు కేంద్రం నుంచి సాధించిన ప్రాజెక్టులు. పార్లమెంట్‌లో సంధించిన సమస్యలు, సాధించిన విజయాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో విఫలమైన తీరును ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా గ్యారంటీల అమలుపై గ్రామీణ స్థాయిలోనూ చర్చ మొదలైన నేపథ్యంలో ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు కాలేదు అప్పుడా విమర్శలా అంటూ ఓ వైపు..మరో వైపు పదేండ్లలో రాని ఇబ్బందులు నాలుగు నెలలకే వస్తాయా అంటూ బీఆర్ఎస్ శ్రేణుల కౌంటర్‌తో రాజకీయ వేడి రాజుకుంటున్నది.


ఫైల్

**మచ్చలేని నాయకుడిగా..** మన్నె శ్రీనివాస్‌రెడ్డి రాజకీయంలోనూ, అటు వ్యక్తిగతంగానూ మచ్చలేని నాయకుడిగా పేరుపొందారు. ఐదేండ్లలో అవినీతి రహిత పాలన అందించి సౌమ్యుడిగా పేరుప్రతిష్టలు తెచ్చుకున్నారు. రాజకీయాల్లోనూ అజాతశత్రువుగా రాణించారు. ఇదే విషయాన్ని పలువురు నేతలు ప్రతి సమావేశంలో చెబుతూ వస్తుంటారు. మన్నెపై ఇటు కేసీఆర్‌తోపాటు, కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. ఐదేండ్లలో పార్లమెంట్ వివిధ సమస్యలపై 350కి పైగా ప్రశ్నలు సంధించారు. కొత్త రైల్వే లైన్లు, స్టేషన్ల సుందరీకరణ, రోడ్లకు సంబంధించి వందల కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు ఎక్స్ వేదికగా కేటీఆర్ ప్రశంసించడం విశేషం.

**పక్కా లోకల్..** పార్లమెంట్ ఎన్నికలు ప్రచారం సందడి మొదలైనప్పటి నుంచి స్థానికతపై చర్చ జరుగుతూ వస్తున్నది. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ తాను నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలో జన్మించానని చెబుతుండగా కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలానికి చెందిన వాడిగా చెబుతూ వస్తున్నా రు. ఇదే క్రమంలో మన్నె శ్రీనివాస్‌రెడ్డి తాను పక్కా లోకల్ అని, మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం గురుకుంట సొంత గ్రామం అని తాను స్థానికుడినని, స్థానిక సమస్యలపై అవగాహన ఉన్నవాడిని అంటూ ప్రచార అస్త్రంగా వాడుతున్నారు. మన్నె కుటుంబ సభ్యులకు ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీలు ఉన్నాయి. దీంతో మహబూబ్‌నగర్ ప్రాంతానికి చెందిన సుమారు 5వేల మందికి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. దీంతోపాటు రాజకీయాలకు అతీతంగా వివిధ రకాల ఉపాధి అవకాశాలు కల్పి స్తూ వస్తున్నారు. స్థానిక యువతకు వారి సొంత కంపెనీలో ఉద్యో గ, ఉపాధి కల్పించారు. ఇదిలా ఉండగా జనాల్లోనూ మన్నె శ్రీని వాస్‌రెడ్డికి మంచి పేరున్నది. గత ఎన్నికల్లోనూ బీజేపీ, కాంగ్రెస్ పోటీ నిచ్చినా 4,11,402ఓట్లు పొంది పాలమూరులో గులాబీ జెండా ఎగురవేశారు. అప్పటి వరకు ఎవరు బరిలో ఉంటారో తెలియని పరిస్థిదిలో అనూహ్యంగా రంగంలో దిగి బరిలో నిలిచి అందరి అంచనాలను తలకిందులు చేస్తూ గెలిచి చూపించారు. అయితే ప్రస్తుతం పార్లమెంట్‌లోని ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందిన వారు ఉండడం, మరోవైపు మోడీ మానియా కొనసాగుతుండగా ఇద్దరి దాటుకొని ఏ మేరకు గెలుపుదారులను చేరుకుంటారో ఫలితాల వరకు వేచి ఉండాల్సిందే.

## ఎమ్మెల్యే పర్ణికరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వైస్ ఎంపిపి బి.కృష్ణ

**కోయిల్‌కొండ, మే 05 ప్రభాతవార్త :** కోయిల్‌కొండ మండల వైస్ ఎంపిపి, మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బి. కృష్ణయ్య ఆదివారం నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈయనతో పాటు 50 మంది గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని ఆచార్యపూర్ గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండయ్య, వడ్డే ఆంజనేయులు సమక్షంలో 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ ఫలాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా పనిచేయడం జరుగుతుందన్నారు. మండలంలోని శేరివెంకటాపూర్, చంద్రాస్‌పల్లి, పారుపల్లి, ఆచార్యపూర్ తదితర గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటించారు. అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మండల టిఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామాలు సమర్పించి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి. రవిందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై. విద్యాసాగర్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పెర్క్యాడ్ సత్యపాల్‌రెడ్డి, నారాయణపేట నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ఎం. రామస్వామి, అభంగపట్నం నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వైస్ ఎంపిపి బి.కృష్ణ

## రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో గోల్డ్ మెడల్స్ సాధించిన జిల్లా విద్యార్థులు

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం**

**వనపర్తి ప్రతినిధి మే 5 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్స్‌లో తెలంగాణ కిక్ బాక్సింగ్, వనపర్తి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాస్టర్ కరాటే శేఖర్ ఆధ్వర్యంలో ఈ నెల 1వ, 2వ తేదీలలో రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన దాదాపు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వనపర్తి జిల్లాకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను వనపర్తి ఆర్టీసీ డీపో మేనేజర్ వేణుగోపాల్ అభినందించి విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికేట్లు అందజేశారు. వనపర్తి డీపోకు చెందిన కండక్టర్ శ్రీధర్ కుమారుడు రుద్ర రెండు గోల్డ్ మెడల్స్ సాధించడంతో డిఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మాట్లాడుతూ ముందుందు జరిగే పోటీలలో వనపర్తి జిల్లా విద్యార్థులు పాల్గొని మరిన్ని మెడల్స్ సాధించాలని ఆయన కోరారు. అనంతరం డిపో మేనేజర్ వేణుగోపాల్ ను జిల్లా కిక్ బాక్సింగ్ ఉపాధ్యక్షుడు మాస్టర్ కరాటే శేఖర్ శాలువాతో సత్కరించారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సర్టిఫికేట్ అందజేస్తున్న డిపో మేనేజర్ వేణుగోపాల్

## రాజ్యాంగాన్ని నలిపివేసే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)





నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేస్తామని పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డికె అరుణకు కాంగ్రెస్‌పార్టీ జడ్పీటిసిని అలాగే ఎమ్మెల్యేను చేసిందని కాంగ్రెస్ పార్టీ ఎంతో ఆ కుటుంబానికి న్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీలోనే వ్యాపారాలు చేసుకున్నారన్నారు. సమావేశానికి గద్వాల, అలంపూర్, వనపర్తి నియోజకవర్గ వేలాదిగా కార్యకర్తలు తరలివచ్చారు. ఎమ్మెల్యేలు మెగారెడ్డి, రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు షేక్షావలి ఆచారి, తనగల సీతారాంరెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నాగశిరోమణి, దేవేంద్ర, మాణిక్యరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, జోగుల రవి, నీలి శ్రీనివాసులు, వెంకటేష్ యాదవ్, పోతురాజు సోమనాద్రి పాల్గొన్నారు.

## జోగులాంబ సన్నిధిలో ప్రముఖులు

**అలంపూర్ మే 05ప్రభాతవార్త :** ఐదవ శక్తి పీఠమైన జోగులాంబ బాల, బ్రహ్మేశ్వరి స్వామి వార్ల ఆలయాలను గద్వాల్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదివారం దర్శించుకున్నారు . ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు . అనంతరం ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు . అదేవిధంగా జనరల్ అబ్జర్వర్ , నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం భాద్యులు పంకజ్ కుమార్ ఐఏఎస్ జోగులాంబ, బాల బ్రహ్మేశ్వరి స్వామి వార్లను దర్శించుకని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





## క్రీడలు స్నేహ బంధాన్ని పెంపొందిస్తాయి...



**వెల్దండ, మే 05 ప్రభాతవార్త:** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు స్నేహ బంధాన్ని పెంపొందిస్తాయని ఆర్‌పీఎల్ నిర్వాహకులు గోకమల్ల రాజు అన్నారు. మండల పరిధిలోని రాచూర్ గ్రామంలో రాచూర్ ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ పోటీల్లో క్రీడాకారులను గోకమల్ల రాజు పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలు క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు దోహద పడుతాయని, వారం రోజుల పాటు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రమేష్‌ముదిరాజ్, ప్రశాంత్, రాజు, సతీష్, శ్రావణ్, క్రీడాకారులు భాస్కర్, సలేశ్వరం, శ్రీను, ప్రహ్లాద్, సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## 10వ తరగతి టాపర్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**అమరచింత మే 5 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో అమరచింత విజేత మోడల్ స్కూల్ విద్యార్థి నూర్జహాత్ పదవ తరగతి ఫలితాల్లో 9.8 గ్రేడ్ సాధించిన సందర్భంగా ఆదివారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థిని కాంగ్రెస్ నాయకులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి, మహంకాళి విష్ణు, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు, జుబేర్ అహ్మద్, కడియాల యాదగిరి, అయు ఖాన్, మన్నన్, కురువ రఘు, తదితరులు ఉన్నారు.

# రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్.. ఇబ్బందులు పడ్డ వాహనదారులు..!

**ఇటిక్యాల, మే 05 ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జన జాతర బహిరంగ సభ నిర్వహించింది. కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. 5 గంటల 50 నిమాషాలు జనజాతర బహిరంగ సభ పూర్తి కాగా 6 గంటల నుండి ఎనిమిది గంటల వరకు ఎర్రవల్లి చౌరస్తా జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జామ్ కొనసాగింది. షేక్‌పల్లె రోడువైపు జన జాతర బహిరంగ సభ నిర్వహించగా సభవైపు కొన్ని వాహనాలు. అలాగే పుల్లారెడ్డి పెట్రోల్ బంకువైపు అలంపూర్ నియోజకవర్గంకు సంబంధించిన వాహనాలు, వనపర్తి నియోజకవర్గానికి చెందిన వాహనాలు ఎర్రవల్లి చౌరస్తా సమీపంలోని కొట్టం ఫార్మసీ కళాశాల కాలేజ్ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. సభ ముగిసిన అనంతరం కొట్టం ఫార్మసీ కళాశాల ఆవరణలో నిలిచిన వాహనాలు వనపర్తి వైపు వెళ్లాలంటే ఎర్రవల్లి చౌరస్తాలో టర్న్ అయి వెళ్లాల్సి ఉంది. అలాగే అలంపూర్ నియోజకవర్గానికి చెందిన వాహనాలు పుల్లారెడ్డి పెట్రోల్ బంక్ నుండి ఎర్రవల్లి చౌరస్తాల టర్న్ అయ్యి తిరిగి అలంపూర్‌కు వెళ్లాల్సి ఉండగా పెద్ద సంఖ్యలో జనజాతర సభకు వాహనాలలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో హైదరాబాద్ నుండి బెంగుళూరు వైపు వెళ్లే వాహనాలు అలాగే కర్నూల్ నుండి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ జామ్ కావడంతో రెండు గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు, ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు గాను గద్వాల జిల్లాపోలీస్ అధికారులు ఎస్సైలు నానా కష్టాలు పడి ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశారు. గంట సేపటి తర్వాత ట్రాఫిక్ ఎక్కువ కావడంతో ఎర్రవల్లి చౌరస్తాలో వాహనాలు టర్న్ కాకుండా కర్నూల్ వైపు వనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన వాహనాలు కొండేరు స్టేజీలో రోడ్డు టర్న్ తీసుకుని బీచుపల్లి వైపు వెళ్లేలా చేశారు. అలాగే అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించిన వాహనాలను చౌరస్తాలో టర్న్ కాకుండా బీచుపల్లి దగ్గర టర్న్ తీసుకుని అలంపూర్ వైపు వెళ్లేలా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో రెండు గంటలు అనంతరం ట్రాఫిక్ సమస్యలు తొలగిపోయాయి.


ఎర్రవల్లిలో కాంగ్రెస్ పార్టీ జన జాతర సందర్భంగా జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు



ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసుల కృషి

## పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఓటు హక్కును ఉపయోగించుకోవాలి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కోరారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు దరఖాస్తు ఉద్యోగులకు ఇప్పటికీ పోలింగ్ కేంద్రాల వివరాలను అందించడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు సిద్దిపేట, దుబ్బాక,గజ్వేల్, హుస్నాబాద్‌లలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలలో ఈనెల 8 వరకు ఓటు వేయవచ్చు తెలిపారు. సిద్దిపేట అర్డీవో కార్యాలయంలో, దుబ్బాకలో ఇంటిగ్రేటెడ్ అఫీస్ కాంప్లెక్స్‌లో గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ అఫీస్ కాంప్లెక్స్, హుస్నాబాద్ అర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలలో ఉదయం 10.30 గంటల నుంచి తమ ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు.

## పద్మశాలీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: నగేష్‌శెట్కార్

**నారాయణఖేడ్, మే 5 ప్రభాతవార్త:**

పద్మశాలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్‌శెట్కార్ అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ పట్టణం లో శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నగేష్ శెట్కార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లడుతూ పద్మశాలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ల ప్పుడు అండగా ఉంటుందన్నారు. పద్మశాలీలు సమాజం పట్ల వృత్తిపరంగా బట్టలునేస్తూ జీవనం కొనసాగిస్తారని చెప్పారు.

పద్మశాలీల కుల వృత్తులను కాపాడేలా వారి జీవితాల్లో పూర్వవైభవం తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గున్నాల నర్సింలు, గుజ్జెటీ సంగయ్య, నక్క నర్సింలు, లక్ష్మినారాయణ, మల్లన్న, కూచిన ప్రకాష్, యువ నాయకులు గున్నాల శ్రీనివాస్, సోమ సిద్దు, గోస్కె శ్రీనివాస్, గుండు శివకుమార్, బోగ పండరి, ఎనుగంటి శంకర్, దుర్గం సతీష్, అనిల్, మార్గం విఠల్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించాలి

**-పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి**

మెదక్ మున్సిపాలిటీ, మే5 ప్రభాతవార్త: వేసవి కాలం దృష్ట్యా ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్. మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండలు, వడదెబ్బలతో ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారని, డూట్యీలు చేయడానికి జంకుతున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు, ఇతర పోలింగ్ సిబ్బందికి ఎండలు మండిపోతున్న దృష్ట్యా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్, ఇతర ఎన్నికల నిర్వహణ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎన్నికల నిర్వహణలో సిద్ధిపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లుకావత్ రామన్న వడదెబ్బకు గురై మరణించడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు దృష్టిలో ఉంచుకొని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, కూలర్స్, చల్లటి త్రాగునీరు, ఎండ తగలకుండా తగు ఏర్పాట్లు చేయాలని, వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాలని కోరారు.



5కే రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి**

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఓటరు శాతం పెంచేందుకు సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(ఎస్‌విఈఈపి) ప్రోగ్రామ్ కార్యకలాపాల్లో అదివారం సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 5కే రన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మిక్కిలినేని మనుచౌదరి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్, సైక్లింగ్ క్రీడాకారులు, విద్యార్థులు,యువకులు, ఉద్యోగులు పెద్దఎత్తున్న పాల్గొన్నారు. ఎస్‌విఈఈపీ కార్యకలాపాలలో 5కేరన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలు మెదక్ పార్లమెంటు పరిధిలోకి వస్తాయని హుస్నాబాద్ కరీంనగర్ పార్లమెంటు పరిధిలోకి వస్తుందన్నారు. మే 13న జరిగే పోలింగ్ లో ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఎవరూ ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌విఈఈపీ నోడల్ అధికారి జయదేవ్ ఆర్యా, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషన్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులు

**జహీరాబాద్, మే 5, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఆదివారం ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. శని, ఆదివారాల్లో వినోద్‌కుమార్, ఆదివారం 253 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని ఆర్‌డిఓ ఎస్ రవి తెలిపారు. ఆదివారం వరకు 460మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ద్వార ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

## భక్తులతో పోటెత్తిన తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయం

**కౌడిపల్లి, మే 5, ప్రభాతవార్త:** తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయం అదివారం భక్తులతో పొటెత్తింది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుండి భక్తులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగస్థులు కుటుంబ సమేతంగా తునికి శ్రీనల్లపోచమ్మ ఆలయానికి పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ తాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు శివప్పలు శ్రీనల్లపోచమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి కుంకుమార్చన చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు శివసత్తుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఆలయం చుట్టూ తిరిగి అమ్మవారికి సమర్పించారు. అలాగే జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ మోహన్ రెడ్డి సిబ్బంది సహకారంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**-డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**

**ములుగు, మే 5 (ప్రభాతవార్త):** పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ములుగు మండలం జప్తిసింగాయిపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు నీలం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి తూంకుంట నర్సారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్, బిజెపి పార్టీల నాయకులను నమ్మి మోసపోవద్దని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపి అభ్యర్థి నీలం మధును గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చిల్వర్‌లో బీరప్పస్వామికి బోనాలు


చిల్వర్ గ్రామంలో బీరప్ప స్వామికి బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

**అల్లాదుర్గం, మే 5, ప్రభాతవార్త:** మండలంలోని చిల్వర్ గ్రామ శివారులోని శ్రీబీరప్ప స్వామికి ఆదివారం బోనాలను ఊరేగించారు. బీరప్ప జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామస్థులు తలపై బోనాలు ఎత్తుకుని సామూహికంగా భజనలు చేస్తూ, యువకుల నృత్యాలు, డోలు వాయిద్యాలు, శివసత్తుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాల మధ్యా భక్తి శ్రద్ధలతో బోనాలను ఊరేగించారు. గోవింద నామస్మరణతో గ్రామం మారుమ్రోగింది. సామూహికంగా బోనాలతో ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలను తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని బోనాలను తిలకించి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బిజెపిలో చేరికలు

**నర్సాపూర్ మే, 5. ప్రభాతవార్త :** మండల పరిధిలోని నత్నాయపల్లి గ్రామస్తులు పలువురు బిజెపిలో చేరారు. ఆదివారం బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్, బిజెపి మండల అధ్యక్షుడు నీలి నాగేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి నత్నాయపల్లి గ్రామానికి చెందిన భూత్ అధ్యక్షుడు సాయినాథ్, బిఆర్‌ఎస్ పార్టీ నుండి గణేశ్, యాదగిరిలతోపాటు 30 మంది యువ నాయకులు ఆ పార్టీలకు రాజీనామ చేసి బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. పాపగారి రమేశ్‌గౌడ్, నీలి నాగేశ్‌ల సమక్షంలో బిజెపిలో చేరారు.బిజెపిలో చేరినవారికి బిజెపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపా ధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ, బిజెపి మండల అద్యక్షులు నీలి నాగేశ్‌లతో పాటు పట్టణ అద్యక్షులు ఆంజనేయులుగౌడ్, మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఆరు గ్యారెంటీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**◆ ప్రజలను బురిడికొట్టిసున్న సిఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో అదివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని నిర్మల్ బహిరంగ సభలో రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాహుల్‌గాంధీ కాదు అయన రాంగ్ గాంధీ అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి 5 గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెబుతుంటే రాహుల్‌గాంధీ అన్ని హామీలను అమలు చేస్తున్నట్లు చెప్పడంతో ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. అబద్దాలు చెప్పడంలో సిఎం రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ కాగా నేనేమి తక్కువ కాదన్నట్లుగా రాహుల్‌గాంధీ మాట్లాడుతున్నారని తెలిపారు. హామీల అమలుపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అబద్దాలు చెప్పడంతోపాటు రాహుల్‌గాంధీతో సైతం అబద్దాలు చెప్పించడం సిగ్గుచేటన్నారు. అరు గ్యారెంటీలలో భాగంగా మహిళలకు ప్రతి నెల ఇచ్చే రూ. 2500 అమలు చేస్తున్నామని రాహుల్‌గాంధీ నిర్మల సభలో చెప్పడం తెలంగాణ మహిళలను అవమానపర్చడమేనని అన్నారు. మహిళలకు ప్రతి నెల రూ. 2500 ఎక్కడ ఇచ్చారో తెలపాలని డిమాండ్‌చేశారు. ఆరు గ్యారెంటీల అమలుపై రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి ఇద్దరు తోడు దొంగల్లా రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. నిర్మల సభలో ఆరు గ్యారెంటీలు అమలవుతున్నాయని రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చేయకపోవడంతో రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఏ పథకాలు అమలవుతున్నాయో తెలుసుకోకుండా రాహుల్‌గాంధీ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆరు గ్యారెంటీల అమలుపై మంత్రులను, కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థులను నిలదీయాలన్నారు. అరు గ్యారెంటీలలో రాహుల్ గాంధీ అన్ని అములయ్యాయని సిఎం రేవంత్‌రెడ్డి 5 గ్యారెంటీలు అమలు చేశామని చెబుతున్నారని నేను మాత్రం ఒక్కటే గ్యారెంటీ అములైందని అంటున్నానని బహిరంగ చర్చకు సిద్దామ అని సవాల్ విసిరారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, అకలి పెరగడానికి కాంగ్రెస్, బిజెపి పార్టీలే కారణమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గుండు భూపేష్, సంపత్‌రెడ్డి,రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హరీష్‌రావు

# వనదుర్గమ్మ సన్నిధిలో భక్తుల సందడి


పూజలందుకుంటున్న ఏడుపాయల వనదుర్గా భవానిమాత, అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**పాపన్నపేట, మే 5, ప్రభాతవార్త:**

పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.

ఆలయానికి చేరుకున్న భక్తులు మొక్కుబడిలో భాగంగా అమ్మవా రికి తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలు సమ ర్పించి, ఒడి బియ్యం నింపి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బంది కల్గకుండా ఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవి వీర్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్ తదితరులు తగు సహకారం అందించారు.

ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు శంకరశర్మ, పార్థివ శర్మ, మురళీధర్‌లు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎస్‌ఐ నరేష్ తన సిబ్బందితో నిఘా నిర్వహించారు.

## సనాతన ధర్మం జీవితంలో భాగమవ్వాలి

**జహీరాబాద్, మే 5, ప్రభాతవార్త:** సనాతన ధర్మ ప్రతి వ్యక్తి జీవితంలో భాగస్వామ్యం కావాల్సి అవసరం ఉందని జన జాగరణ మంచ్ తెలంగాణ ప్రాంత బాధ్యులు నల్లా చక్రవర్తుల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని రాం మందిరంలో సనాతన ధర్మ-మన కర్తవ్యం అంశంపై బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు నల్లా చక్రవర్తుల రామకృష్ణ ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. సనాతన ధర్మం విషయంలో అపోహాలు ఏర్పడేలా రాజకీయ వివాదాలు సృష్టిస్తున్నారని, హిందూమతంలో చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక సమరసత, ప్రకృతి పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేదం లాంటివి ఉన్నాయని, ఈ దిశగా ప్రజలు చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయత, హిందూ ధర్మం వేరు వేరని గుర్తు చేశారు. క్రమశిక్షణతో ఎదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం, బ్రాహ్మణ సేవా సమాజ్ అధ్యక్షులు శంకర్‌రావు కులకర్ణి, రాజ్‌కుమార్ దేశ్‌పాండే, వైద్యులు సురేస్ కులకర్ణి, బావురావు జ్యోషి, పుణీత్ దీక్షితులు, సురేష్ జోషి, మహిళా నాయకులు ప్రభావతి, రత్నమాల పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నల్లా చక్రవర్తుల రామకృష్ణ

# ఈవీఎంల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్**

**నర్సాపూర్ మే, 5, ప్రభాతవార్త :**

ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం ఈవిఎంల కమిషనింగ్ ప్రక్రియను చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి కళాశాలలో ఈవిఎంల కమీషనింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కమీషనింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈవిఎంల సీరియల్ నెంబర్‌లు, అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తుల ఏర్పాటు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కమీషనింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి ఈవిఎంల పనితీరును పరిశీలించాలన్నారు. అలాగే స్ట్రాంగ్ రూమ్ నిర్వహణ వివరాలను ఏఆర్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఆర్డీవో కార్యాలయానికి ఓటు వేయడానికి వచ్చే ప్రతి పౌరునికి అధికారులు, సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ వెంట ఎన్నికల అధికారి ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహాసీల్దార్‌లు కమలాద్రి, శ్రీనివాస్‌చారి, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్


బీరప్ప జాతర ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## వైభవంగా శ్రీబీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవం

**మనూర్, మే 5, ప్రభాతవార్త:** మండలంలోన తుమ్నూర్ గ్రామంలో శ్రీ బీరప్పస్వామి జాతర మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని ఆలయ కమిటి ఘనంగా సన్మానించారు. ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావ పాటిల్, నాయకులు అశోక్‌రెడ్డి, గుండన్న, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మైకోడ్‌లో సామూహిక యజ్ఞం


మైకోడ్‌లో సామూహిక యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

**మనూర్, మే 5, ప్రభాతవార్త:** మండలంలోని మైకోడ్ గ్రామంలో ఆదివారం వివేకానంద సేవ సమతి ఆధ్వర్యంలో సామూహిక జ్ఞ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 5 సంవత్సరాలుగా గ్రామం సుభిక్షంగా ఉండేందుకు ప్రతి మాసంలో వచ్చే మొదటి ఆదివారం రోజున గ్రామంలో సామూహికంగా యజ్ఞ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా మే నెల మొదటి ఆదివారం ఆలయంలో 12 మంది పుణ్యదంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. క్రార్యక్రమాలకు ముఖ్య అతిథులగూ కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంఘం మహారాజ్, విశ్వహిందూ పరిషత్ తెలంగాణ సత్సంగ్ కమిటి అధ్యక్షులు మరిపల్లి రాంరెడ్డి, వివేకానంద సేవ సమితి బాధ్యులు, గ్రామ భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## బిజెపిలో చేరిన బిఆర్‌ఎస్ నేతలు

**సిర్గాపూర్, మే 5, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ జడ్పీటిసి సభ్యులు రాఘవ్ రెడ్డి, రాష్ట్ర లింగ యూత్ ఇంచార్జి అరుణ్ రాజ్‌శేఖర్, మాజీ సర్పంచ్‌లు, బిఆర్‌ఎస్ నేతలు భారతీయ జనతా పార్టీ ఎంపి అభ్యర్థి బిబి పాటిల్ సమక్షంలో ఆదివారం చేరారు. పార్టీలో చేరిన జడ్పీటిసి సభ్యులు, రాష్ట్ర లింగ యూత్‌ఇంచార్జి, మాజీ సర్పంచ్‌లు సంజురెడ్డి,భూమారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కిష్టారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రహీంసాబ్, బాబాసాహెబ్, అమ్సప్ సాబ్ (80 మంది)ని బిజెపి ఎంపి అభ్యర్థి బిబి పాటిల్ బిజెపి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.


దగ్ధమవుతున్న అడవి

## మంబాపూర్ అటవీ ప్రాంతంలో అడవికి నిప్పు

**గుమ్మడిదల, మే 5 ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గం గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో ఆదివారం అడవికి దుండగులు నిప్పు అంటించారు. స్థానికుల సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు స్పందించి సకాలంలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ మంజత్ సింగ్ మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అటవీ ప్రాంతం గ్రామాలకు దగ్గరగా ఉన్నందున ఎవరైనా వెళ్లి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ ప్రాంతానికి నిప్పు అంటించకుండా జాగ్రత్త వహించాలన్నారు. అడవి నిప్పు అంటించడం సరైన పద్ధతి కాదని, క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముస్లాపూర్‌లో కారు దగ్ధం

**అల్లాదుర్గం, మే 5, ప్రభాతవార్త:** హైదరాబాద్ నుంచి నాందేడ్ వైపు అకోలా 161వ జాతీయ రహదారిపై వెళుతున్న కారు అగ్నికి ఆహుతైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని ముస్లాపూర్ గ్రామ శివారులో ప్రయాణిస్తున్న కారు (టిఎస్ 11ఈడి 5325)లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారు డ్రైవర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. కారులో చెలరేగిన అగ్ని కీలలకు కారు పూర్తిగా కాలిపోయింది. అటుగా వెళుతున్న వాహన చోదకులు విషయాన్ని అగ్నిమాపక సిబ్బందికి చేరవేయగా అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. హైదరాబాద్‌కు చెందిన పంపంగి రమేష్‌కు చెందిన కారుగా గుర్తించామని అల్లాదుర్గం పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.


ముస్లాపూర్ జాతీయ రహదారిపై అగ్నికి ఆహుతి అవుతున్న కారు